# అనంతసాగరం నాగమునీంద్రస్వామి

బాల్యం నుండే మానవతాగుణాలు క్రమ వికాసం పొంది నడివయస్సునాటికి దైవీ గుణాలుగా పరిణమించిన సత్పురుషుల్లో పేర్కొనదగినవారు నాగమునీంద్రస్వామి. నెల్లూరుజిల్లా ఆత్మకూరుతాలూకా చుట్టగంటపల్లెలో కాయకష్టం చేసి బ్రతికేసుబ్బయ్య అనే ఒక నిరుపేద వడ్డెర ఉండేవాడు. అతని కొడుకు నాగయ్యయే నాగమునీంద్రస్వామి. నాగయ్య 1897 సంవత్సరం పుట్టినాడు. చదువుసంధ్యలు లేకున్నా చిన్నప్పటినుండి నాగయ్యకు పాపభీతి దైవప్రీతి సత్యనిరతి మెండు. బుద్ధి వికసించినకొలది రామభక్తి మారాకులు తొడిగినది. నాగయ్య ఆజానుభాహువు, బలిష్ఠుడు, నలుగురు చేసేపని ఒక్కడే చేసేవాడు. నడివయస్సు దాకా బావులు త్రవ్వి పొట్ట పోసుకున్నాడు.



అప్పుడప్పుడు భద్రాచలం వెళ్ళి శ్రీరామచంద్రదర్శనం చేసివచ్చే నాగయ్యకు అక్కడే దీర్ఘకాలం తపస్సు చేయవలెననిపించినది. ఆ దేవుని అరణ్యవాసమంత కాలం 14 ఏండ్లు నాగయ్య దీక్షగా గోదావరీస్నానం చేసి, శ్రీరామచంద్రుని సేవించి గంటలకొలది ఆలయప్రదక్షిణం చేసేవాడు. ధునివేసుకొని నిరంతరం ధ్యానంలో ఉండేవాడు. ఆయన తపస్సు 14 ఏండ్లకు ఫలించినది. కలలో శ్రీరామచంద్రుడు కన్పించి చెప్పినవిధంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకా అనంతసాగరం చెఱువురేవు ఉత్తరభాగాన అనంరాయుడు పాలించిన శేషగిరిలో ఉన్న పుట్టుశిలను కనుగొని ఆలయం కట్టి నాగయ్య శ్రీరామచంద్రుని కొలువులో చేరిపోయినాడు. ఆయన కనిగిరి ప్రాంతంలో యోగసిద్ధి పొందిన మహనీయుడైన శివరమయోగి సంప్రదాయానికి చెందిన గురువు వద్ద నాగయ్య దీక్షితుడై నాటినుండి నాగమునీంద్ర స్వామిగా ప్రసిద్ధుడైనాడు. తపస్సుతో దుర్గాదేవిని ప్రత్యక్షం చేసుకొన్నాడు.

ఒకనాడు నాగమునీంద్రస్వామి దుర్గాదేవి ఆజ్ఞప్రకారం భైరవకోనకు పోయి భక్తుల సహాయంతో ప్రాచీనదేవాలయం జీర్ణోద్ధార చేసినాడు. ఆదిభైరవుని, త్రిముఖదుర్గాంబల మండపాలు కనిగిరి రాఘవులచే పూర్తిచేయించి శేషమునీంద్రుల మండపంలో శివరాత్రి, కార్తీకపౌర్ణమి ఉత్సవాలు, శ్రీరామనవమి, శ్రీ సీతారాముల కల్యాణం జరిపించినాడు. తరువాత కనిగిరికి వచ్చి మాచవరంలో మఠం నిర్మించి బావి త్రవ్వించి మఱ్ఱిచెట్టు పాతించి యజ్ఞాలు రథోత్సవాలు జరిపినాడు. ఎఱ్ఱగడ్డపాడు పాలేటిగంగ వద్ద సత్రం కట్టించి మఱ్ఱిచెట్టు నాటినాడు. గంగాభవానికి రథం చేయించినాడు. రామతీర్థంలోను మాలకొండలోను యజ్ఞాలు చేయించినాడు. నాగమునీంద్రుడు అనంతసాగరం రామాలయం చేరి సోమ శుక్రవారాలు తప్ప మిగతా దినాలు అక్కడే ఉండేవాడు. ప్రతి శుక్రవారం మాచవరంలో, ప్రతి సోమవారం వెంగళాయెపాళెం గంగ గుడివద్ద, శివరాత్రి నాడు భైరవకోనలో హోమాలు ప్రారంభించినాడు. ఈ హోమాలద్వారా తమను ఆశ్రయించిన భక్తుల, శిష్యుల బాధలు, గతజన్మల, ఈజన్మల కర్మదోషాలు తొలగించేవాడు.

భైరవకోనలో శేషమునీంద్రులనే భగవత్స్వరూపులైన మహాత్ములు సూక్ష్మరూపంలో ఉన్నారనీ, నాగమునీంద్రులు శేషమునీంద్రుల దర్శనం దివ్య ప్రకాశరూపంలో చేయించినందున శేషమునీంద్రుల అంశయే నాగమునీంద్రులనీ శ్రీవారి భక్తుల విశ్వాసం. నాగమునీంద్రులకు శ్రీరామచంద్రులవలె శేషమునీంద్రులు కూడా ఇష్టదైవతం, భక్తులకు కొత్తపలకలపైన నాగ మునీంద్రులు "ఓంరామా శ్రీరామా శేషమునీంద్రా" అని వ్రాసి యిచ్చి నిత్యమూ ఏకాగ్రతతో దిద్దుకొనమనే వారు. భక్తులు తెచ్చే కొబ్బరికాయలు కొట్టి ఆ నీరు వారి నెత్తిపై "గంగేచ యమునేచైవ" అంటూ పోసి వారి పీడలను, రోగాలను తొలగించేవారు. నాగ మునీంద్రస్వామి కర్మానుభవం గురించి కొన్ని కొత్త విషయాలు చెప్పినారు. పూర్వజన్మలో చేసిన కర్మఫలితాలు ఈ జన్మలో అనుభవించటమే కాక పూర్వజన్మల్లో తల్లిదండ్రులు చేసిన దుష్కర్మఫలితాలు సంతానం అనుభవించవలసి వస్తుందనేవారు. మానవులు బిడ్డలమీది వ్యామోహంవలన అక్రమాలు, అధర్మాలు చేసి ధనం కూడబెట్టుతారు. ఆ ధనమూ ఆస్తిపాస్తులు అనుభవించినంతకాలం వారి సంతానం కూడ ఆ పాపఫలితం అనుభవించవలసి ఉంటుందనే వారు. ఏపాపం ఎరుగనివాళ్ళు వచ్చి తమ కష్టనష్టాలు చెప్పుతుంటే వారి పూర్వీకులు చేసిన పాపాలు చెప్పి అందువలననే మీరీబాధలు అనుభవిస్తున్నారనే వారు. అక్రమధనార్జనం చేసి తమ బిడ్డలకు కష్టాలే మూటకట్టి ఇస్తున్నామనీ, ఎవరికీ ఎట్టి అపకారం అన్యాయం చేయకుండా ఉండటమే మన సంతతికి మేలు చేయటమనీ చెప్పేవారు. స్వామి వారెవరి బాధలు తొలగించినా అది భగవంతుని దయ అనేవారు. తమ గురించి, తమ మహిమల గురించి ప్రచారం చేయటం, చెప్పడం, ఇష్టపడని నిరాడంబరులు శ్రీ నాగమునీంద్రస్వామి ఒకరోజు స్వామి రాముడి అనుమతి ఐనది. సమాధి గుంటలోనికి వెళ్ళిపోతాను" అన్నారు. అక్కడున్న శిలలను చూపిస్తూ "సాక్షాత్తు రాముడేనయ్యా! ఇక్కడకు వచ్చి ఏది అనుకుంటే అది అవుతుందయ్యా." శిలలవైపు చూపిస్తూ "నేను అక్కడే ఉంటానయ్యా" అని చెప్పినారు. అన్నట్లే నాగమునీంద్రస్వామి అనంతసాగరం శ్రీరామచంద్రునిలో ఐక్యమై అక్కడే ఉంటున్నారు.

శ్రీముఖ సంవత్సర జ్యేష్ఠ బహుళ త్రయోదశి గురువారం సాయంకాలం 5-59 గంటలకు (17-6-1993) శ్రీ నాగమునీంద్రులు శరీరం చాలించినారు. మఱ్ఱిచెట్టువద్ద వారికి స్నానం చేయించి సమాధి చేసినట్లు కలవచ్చింది. మరునాడుదయమే ఆ వార్త తెలిసి భక్తులంతా అనంతసాగరం చేరినారు. దూరదూరాల భక్తులు వచ్చినతరువాత మూడవనాడు నాగమునీంద్రులను సమాధిచేసినారు. శ్రీవారి ఆరాధనోత్సవాలు ఏటేట అనంతసాగరం చెరువుకట్ట వద్ద, మాచవరం, గంగాభవాని వద్ద జరుగుతున్నవి.

సేకరణ : **"అంగీరస"**